# డంపింగ్‌యార్డు నిర్మించొద్దు

- ప్యారానగర్ శివారులో డంపింగ్‌యార్డు ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు ఆందోళన
- వ్యర్థజలాలు పంపించినా చర్యలు తీసుకోలేరు
- కరెంట్ సమస్యలను పరిష్కరించడం లేదు..
- గుమ్మడిదల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల నిలదీత



గుమ్మడిదల మండలసర్వసభ్యసమావేశంలో మండల ప్రజాప్రతినిధుల సమక్షంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శ్రీధర్

గుమ్మడిదల, అక్టోబర్ 4 : హెచ్‌ఎండీ చెత్తను మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఉన్న అటవీప్రాంతంలో ఏర్పాటు చేసి పచ్చని వాతావరణానికి విఘాతం కలిగిస్తే సహించే పరిస్థితి లేదని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. దీనిపై సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. బుధవారం గుమ్మడిదలలో మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఎంపీపీ ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి జడ్పీటీసీ కుమార్‌గౌడ్, డీఎఫ్ వో శ్రీధర్, ఎఫ్‌ఆర్వో వీరేంద్రబాబు హాజరయ్యారు. సమావేశంలో నల్లవల్లి పంచాయతీలోని ప్యారానగర్ శివారు అటవీ ప్రాంతంలో హెచ్‌ఎండీఏ అధికారులు హైదరాబాద్‌కు చెందిన చెత్తను ఇక్కడికు తెచ్చి డంపింగ్ చేయాలని యోచిస్తున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్యారానగర్ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడానికి పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నారని నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం సర్పంచ్‌లు శంకర్, ఆంజనేయులు, హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో శ్రీధర్, రేంజ్ ఆఫీసర్ వీరేంద్రబాబు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు కోసం దారి చూపించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు రహదారిని చూపించడానికి వచ్చామన్నారు. అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే అడవి సంపద తరిగిపోవడమే కాకుండా వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయొద్దని తీర్మానం చేసి జిల్లా అధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. మండలంలో కరెంట్ సమస్య సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. ఇటీవల వానకాలంలో బొంతపల్లి, దోమడుగు పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమలు విచ్చలవిడిగా రసాయన జలాలను పంపించడంతో రాయునిచెరువు, నల్లకుంట, రాజనాల చెరువు పూర్తిగా కలుషితమయ్యాయని, అయినా, పీసీబీ అధికారుల చర్యలు తీసుకోలేదని ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి అరుణ, పీహెచ్‌సీ వైద్యాధికారి మధుకర్, ఏఈపీఆర్, ఐసీడీసీ అధికారులు మాట్లాడారు. నాలుగేళ్లలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేసినట్లు ఎంపీపీ ప్రవీణ, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ తెలిపారు. అర్హులైన ప్రతి వ్యక్తికి, కుటుంబాలకు బీసీబంధు, గృహలక్ష్మి పథకం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మంజులా వెంకటేశ్‌గౌడ్,ఎంపీవో దయాకర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

### నేడు చిలిపిచెడ్‌లో
## బతుకమ్మ చీరల పంపిణీ
★ హాజరుకానున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

చిలిపిచెడ్, అక్టోబర్ 4 : తెలంగాణ ఆడపడుచుల గౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలు పంపిణీని చిలిపిచెడ్ మండలంలో ప్రారంభించనున్నారు. మండలకేంద్రం చిలిపిచెడ్‌కు బతుకమ్మ చీరలు వచ్చినట్లు ఎంపీడీవో శశిప్రభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం చిలిపిచెడ్ మండలకేంద్రంలో ఉదయం 10 గంటలకు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శశిప్రభ, వైస్‌ఎంపీపీ విశ్వంభర స్వామి తెలిపారు. చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు చీరల పంపిణీని విజయవంతం చేయాలని కోరారు.

# ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

- మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, అక్టోబర్ 4 : మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు రూపశ్రీ కౌంటీ, నందన్ మెడోస్, శంకర్ గ్రీన్ హోమ్స్, దుర్గాప్రావీన్స్ కాలనీలో బుధవారం ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న అమీన్‌పూర్ మున్సిపల్‌లో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం లో కౌన్సిలర్లు కొల్లూరి చంద్రకళాగోపాల్, కల్పనాఉపేందర్‌రెడ్డి, బోయిని బాలమణీబాలరాజు, బిజిలి రాజు, నవనీతాజగదీశ్, కవితాశ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, యూనూస్, నాయకులు శేఖర్, ఆంజనేయులు, చౌటకూరి మహిపాల్ రెడ్డి, కొల్లూరు యాదగిరి, హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, బీజీఎం చంద్రశేఖర్, ఏఈ అమీరుద్దీన్ పాల్గొన్నారు.



మహిళలకు తాగునీటిని అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



రైతులకు రుణమాఫీ చెక్కును అందజేసిన చింత ప్రభాకర్

# రైతులకు రుణమాఫీ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి, అక్టోబర్ 4 : ప్రభుత్వం లక్ష రూపాయలలోపు రుణాలను ఒకే విడతలో మాఫీ చేయడంతో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, రుణమాఫీ పొందిన ప్రతి ఒక్కరూ తిరిగి రుణాలు తీసుకుని ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింత ప్రభాకర్ సూచించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 13792 మంది రైతులకు రుణమాఫీ రూ. 7892.21లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేసిందని, పంటలు సమయానికి పెట్టుబడికి రైతుబంధు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్బీఐ, ఏబీవీపీ బ్యాంక్ అధికారులు కృష్ణరెడ్డి, మోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారులు మనోహర, ప్రసాద్, అనిత, చైతన్య, ప్రదీప్, గణేశ్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.




కోర్సు ప్రారంభోత్సవానికి హైదరాబాద్ వెళ్తున్న తారా విద్యార్థులు

# బీబీఏ రిటైలింగ్‌తో బంగారు భవిష్యత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 4 : రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరం నూతనంగా ప్రవేశ పెట్టిన బీబీఏ రిటైలింగ్ కోర్సు ప్రారంభోత్సవం బుధవారం నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో జరిగింది. ఈ కార్యక్రమానికి తారా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పెద్దఎత్తున తరలివెళ్లారు. హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్ అభినందించారు. బీబీఏ కోర్సులో వారంలో మూడు రోజులు తరగతులు, మరో మూడు రోజులు స్టైఫండ్‌తో కూడిన పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ ఉంటుందన్నారు. బీబీఏ రిటైలింగ్ కోర్సు చేస్తున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, కామర్స్ విభాగాధిపతి సంతోషి, అధ్యాపకులు రాజేశ్ పాల్గొన్నారు.

## కుమ్మర్లకు పనిముట్లు అందజేత



కుమ్మరి సారెను ప్రారంభిస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్

జిన్నారం, అక్టోబర్ 4 : మండలంలోని వావిలాల, జంగంపేట గ్రామాల్లో కుమ్మరి కులస్తులకు బుధవారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ పనిముట్లు అందజేశారు. అనంతం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కుమ్మరి వృత్తిదారులు వృత్తి నైపుణ్యాలు పెంచుకుని, ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల భార్గవ్, ఉపసర్పంచ్ నవనీత్ రెడ్డి, వార్డు సభ్యుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు సుధాకర్ గౌడ్, కడారి రమేశ్, ప్రకాశ్‌గౌడ్, కుమ్మరి సంఘం గ్రామాధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామస్తులు నర్సింహులు, యాదయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ, శ్రీనివాస్, భిక్షపతి, కృష్ణ ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై వినయ్‌కుమార్

కొండాపూర్, అక్టోబర్ 4 : సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, నేరగాళ్లకు చిక్కకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్సై వినయ్‌కుమార్ సూచించారు. కొండాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్నెట్ వినియోగించుకుని అనేక మంది మోసాలకు పాల్పడుతున్నారని, ఎలాంటి ఘనలు ఉన్నా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. సెల్‌ఫోన్లలో వ్యక్తిగత ఫొటోలతోపాటు సమాచారం ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దన్నారు. విద్యార్థినులు ఆపద సమయంలో 1930, 100, 108 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి, సమాచారం ఇస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. 18ఏండ్లు నిండిన తర్వాతే విద్యార్థినులు వివాహం చేసుకోవాలని సూచించారు. మైనర్లను వేధిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు రోడ్డు నిబంధనలు పాటించి, ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ఆడపిల్లకు మహిళా సంఘాల భరోసా

సంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 4 : ఆడపిల్ల ఇంటికి మహలక్ష్మి అని, ఆడపిల్ల కుటుంబానికి అండగా ఉంటామని మహిళలు తీర్మానించారు. 95 మహిళా సంఘులకు చెందిన 968 మంది మహిళలు ఆడపిల్ల కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడానికి ప్రతి సభ్యురాలు ప్రతినెలా రూ.10 సంఘంలో జమ చేయనున్నారు. పుట్టిన ప్రతి ఆడపిల్ల కుటుంబానికి రూ.4000 ఇవ్వాలని నిర్ణయించారు. సంగారెడ్డి మండలంలోని ఇస్మాఖాన్‌పేట గ్రామంలో మహిళలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సుమరు 11 మంది ఆడపిల్లల తల్లులకు నూతన వస్త్రాలు పెట్టి, రూ.4వేల ఆర్థికసాయాన్ని సర్పంచ్ మంజల, జడ్పీటీసీ సునీతా మనోహర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్మిత, మహిళలు సునీత, అనిత, లక్ష్మి, సుకన్య, రూప ఉన్నారు.

## జిన్నారంలో గణేశ్ నిమజ్జనోత్సవం

జిన్నారం, అక్టోబర్ 4 : మండల కేంద్రం జిన్నారంలో వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేసి గణపతిని మంగళవారం రాత్రి నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా వినాయక లడ్డూను రూ.55వేలకు దీక్షిత్‌గౌడ్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్యాశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవ, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



దీక్షిత్‌గౌడ్‌కు లడ్డూను అందజేస్తున్న గూడెం సంతోష్‌రెడ్డి